క్లుప్తంగా

వాహనాల వేలం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయంలోని శుక్రవారం వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు. నాలుగు వాహనాలకు ప్రభుత్వ నిర్ణయించిన ధర రూ 91 వేలు ఉండగా, రూ 1,15,640 రుపాయలకు వేలం పాడి వాహనాలు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. వేలంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో రాజేశ్వర్

సిరికొండ: మండలంలో కొనసాగుతున్న ఈజీఎస్ పనులను శుక్రవారం డీఆర్‌డీవో రాజేశ్వర్ పరిశీలించారు. మండలంలోని పోన్న గ్రామంలో ఫారంఫండ్ పనులు, నర్సరీ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం పూటనే పనులకు రావాలని కూలీలకు సూచించారు. వచ్చే జూన్ నాటికి మొక్కల పెంపకం పూర్తి కావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీఎం భీంరావు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న రత్నజాడే ప్రజ్ఞాకుమార్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని శివఘాట్ గ్రామం భారతీయ బౌద్ధ మహాసభ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నట్లు భారతీయ బుద్ధ మహాసభ రాష్ట్ర నాయకుడు రత్నజాడే ప్రజ్ఞాకుమార్ తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా భగత్ హరీశ్, భవరే సురేశ్, కోశాధికారిగా అశ్వదీప్, ఉపాధ్యక్షుడిగా మనోహర్ భగత్, రత్నదీప్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా లోకేష్ పాటిల్‌ను ఎన్నుకున్నారు. రత్నజాడే ప్రజ్ఞాకుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బౌద్ధ మతాన్ని స్వీకరించాలని, అంబేడ్కర్ చూపించిన మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు విట్టల్ బుక్డే, దయానంద, కాంతారావు, దయానంద్, కైలాష్, హీరాలాల్, యశ్వంత్ భగత్, ఉల్లాస్ పాల్గొన్నారు.

గర్భిణీ ఆసుపత్రికి తరలింపు

నేరడిగొండ: మండలంలోని భవానితండాకు చెందిన గోతి సరస్వతిరాజు అనే గర్భిణీ శుక్రవారం నేరడిగొండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాగా, 108 అంబులెన్స్ ద్వారా నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి పీహెచ్‌సీ హెచ్‌ఈవో పవార్ రవీందర్, హెల్త్ అసిస్టెంట్ సంతోష్‌లు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆమెను తరలించడం జరిగిందని పేర్కొన్నారు.

సివిల్ కాంట్రాక్టర్ ప్రవీణ్ హఠాన్మరణం



అంత్యక్రియలో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ సివిల్ క్లాస్ వన్ కాంట్రాక్టర్ గుట్ట ప్రవీణ్ శుక్రవారం హఠాన్మరణం చెందారు. ఆయన గత కొన్ని నెలలుగా హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబీకులు హుటాహుటిన సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించారు. దీంతో ఆయన భౌతిక కాయాన్ని శుక్రవారం పట్టణంలోని ఓల్డ్ హౌజింగ్‌బోర్డులో గల తన నివాసానికి తరలించారు. సాయంత్రం పట్టణంలోని తిర్పెల్లి స్మశాన వాటికలో అంత్యక్రియలను నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అంత్యక్రియలో పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను అర్హులకే కేటాయించాలి

ఖానాపూర్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులైన నిరుపేదలనే ఎంపిక చేయాలని బహుజన కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకుడు పసుపుల వెంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. పలు చోట్ల ఇందిరమ్మ కమిటీ సభ్యులతోపాటు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తూతూ మంత్రంగా సర్వే చేయడంతో అర్హులైన పేదలు నష్టపోతున్నారని వాపోయారు. కలెక్టర్ దృష్టి సారించి అర్హులు ఎంపికయ్యేలా చూడాలని కోరారు.

‘ఉపాధి’ సిబ్బంది కొరత

- 19 గ్రామ పంచాయతీలకు 9 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు
- అరకొర సిబ్బందితో నెట్టుకొస్తున్న వైనం



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

సిరికొండ: గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంతో పాటు, వలసలు తగ్గిస్తూ కూలీలకు ఆర్థికంగా చేయూతనందిచాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తోంది. కానీ గత ప్రభుత్వం నూతనంగా మండలాలు, గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి నూతన మండలాలకు కూడా ఉమ్మడిగా ఉన్న గ్రామ పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్‌లను పెట్టి ఉపాధిహామీ పథకాన్ని నెట్టుకొస్తున్నారు. అయితే నూతనంగా ఏర్పాటు చేసిన పంచాయతీలకు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించకపోవడంతో కూలీల సంఖ్యకు అనుగుణంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లు లేక కూలీల సంఖ్య తగ్గుతుంది.

9 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు..

నూతనంగా ఏర్పడిన సిరికొండ మండలంలో మొత్తం 19 గ్రామ పంచాయతీలు ఉండగా.. 52 గ్రామాలున్నాయి. 19 గ్రామ పంచాయతీలకు మొత్తం 9 మంది మాత్రమే ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉన్నారు. ఒకొక్క ఫీల్డ్ అసిస్టెంట్‌లకు రెండు నుంచి మూడు గ్రామాల బాధ్యతలను అప్పగించారు. వీరంతా రోజు వారీగా ఉపాధి కూలీలకు పని కల్పించడం, మస్టర్లు తీయడం, పనులను అప్పగించడం, జాబ్ కార్డులను మంజూరు చేయడం, ఆధార్ అనుసంధానం, కూలీలకు వసతులు కల్పించడం, పనుల తర్వాత ఫొటో క్యాప్చర్ చేయడం వంటి పనులు నిర్వహిస్తారు. ఇలా అన్ని పనులను ఫీల్డ్ అసిస్టెంట్లు చూసుకోవడం ఇబ్బందిగా మారింది.

టెక్నికల్ అసిస్టెంట్ల కొరత..

కూలీలకు పనులు చూయించడం, పనులను పర్యవేక్షించడం వంటి పనులు ఫీల్డ్ అసిస్టెంట్లు చేస్తే, కూలీలు చేసిన పనిని కొలతలు తీసుకొని వారికి వేతనం ఇప్పించడంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు కీలక పాత్ర పోషిస్తారు. ఇలాంటి టెక్నికల్ అసిస్టెంట్‌లు మండలంలో మొత్తం 7గురు మాత్రమే ఉన్నారు. వారితోనే ఉపాధి పనులను నెట్టుకొస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫీల్డ్ అసిస్టెంట్లను, టెక్నికల్ అసిస్టెంట్లను నియమించాలని కూలీలు కోరుతున్నారు.

కొరత ఉంది



మండలంలో ఉపాధి సిబ్బంది కొరత చాలా ఉంది. 19 గ్రామ పంచాయతీలకు 9 మంది ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉండటంతో ఉపాధి కూలీలకు పని కల్పించడం, పనుల పర్యవేక్షణ ఇబ్బందిగా మారింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిజేయస్తాం.

– భీంరావు, ఏపీవో, సిరికొండ

నియమించాలి



నూతనంగా ఏర్పడిన పంచాయతీలకు ఉపాధిహామీ ఫీల్ అసిస్టెంట్‌లను నియమించాలి. ఒకొక్క ఫీల్డ్ అసిస్టెంట్ మూడు పంచాయతీలకు బాధ్యతలు అప్పగించారు. దీంతో కూలీలకు సరైన న్యాయం చేయలేకపోతున్నారు.

– ఆవుల రవి, ఉపాధిహామీ కూలీ, సిరికొండ

పంటమార్పిడి పాటించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

బోథ్: మండలంలోని మందబొగడ గ్రామంలో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని వ్యవసాయ కళాశాల ఆదిలాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్‌లు కిరణ్‌రెడ్డి, మౌనిక, అగ్రోనమీ ప్రొఫెసర్ మంజులత రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయంలో తక్కువ యూరియా వాడకం, అవసరం మేరకు రసాయన మందులను వినియోగించడం, రసీదులను భద్రపరచడం, సాగునీటి ఆదా, పంట మార్పిడి పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవితేజ, ఉద్యానవన అధికారి, వెటర్నరీ అసిస్టెంట్‌లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

బజార్‌హత్నూర్: రైతులు రసాయనిక ఎరువుల వాడకంతో తగ్గించాలని కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అనంతపూర్ గ్రామంలో ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. తక్కువ ఎరువుల వినియోగం, సాగు నీటి ఆదా, సోయ, పత్తి, మొక్కజొన్న, ఆయిల్‌పాం సాగు పద్ధతులను వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్త అనిల్ కుమార్, ఏవో మహ్మద్ సాద్, హార్టికల్చర్ అధికారి క్రాంతి కుమార్, రైతులు పాల్గొన్నారు.

వ్యాపార సముదాయాలు మూసివేయాలి



మాట్లాడుతున్న సీఐ సునీల్ కుమార్

ఆదిలాబాద్‌టౌన్: రాత్రి పదిన్నర గంటల తరువాత వ్యాపార సముదాయాలు మూసివేయాలని పట్టణ వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పలువురు వ్యాపారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు మూడు రోజులుగా పోలీసు సిబ్బంది పట్టణంలో గస్తీ నిర్వహిస్తుండగా పలువురు వ్యాపారులు తమ దుకాణాలను తెరిచి ఉంచారన్నారు. ముఖ్యంగా పాన్‌షాప్, టీ షాప్, కిరాణా షాప్, హోటల్స్ ఉండగా.. అందులో పది మందిపై కేసులు నమోదు చేసినట్లుగా పేర్కొన్నారు. యువత ప్రమాదాలను గురి కాకుండా , చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉండేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఫాసిజంపై కమ్యూనిజం విజయమే విక్టరీ డే



మాట్లాడుతున్న కేవీపీఎస్. రాజు

ఆదిలాబాద్‌టౌన్: ఫాసిజంపై కమ్యూనిజం విజయం సాధించిన రోజే ప్రపంచంలో విక్టరీ డేగా ప్రసిద్ధి కెక్కిందని సీపీఎం రాష్ట్ర నాయకులు రాజు అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అధ్యక్షతన శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో ఫాసిజంపై కమ్యూనిజం విజయం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఫాసిస్టు హిట్లర్‌ను సోవియట్ రష్యా రెడ్ ఆర్మీ ఓడించిన రోజు మే 9 అని గుర్తు చేశారు. హిట్లర్‌ను ఓడించి జర్మనీ పార్లమెంట్‌పై ఎర్రజెండాను ఎగిరేసిన రోజు విక్టరీ డే గా ప్రసిద్ధి కెక్కిందన్నారు. కార్యక్రమంలో నాయకులు లంక రాఘవులు, పూసం సచిన్, అన్నమొల్ల కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

గోండు జాతి అభివృద్ధికి కృషి చేద్దాం



ప్రతిజ్ఞ చేస్తున్న గోండు జాతి ఉద్యోగులు

బేల: గోండు జాతి అభివృద్ధికి, పరిరక్షణకు కృషి చేద్దామని రాజ్‌గోండ్ సేవా సమితి మండల గౌరవ అధ్యక్షుడు మెస్రం వాసుదేవ్, మండల అధ్యక్షుడు నాగోరావులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కుమురం భీం కమ్యూనిటీ హాల్‌లో మండల రాజ్‌గోండ్ సేవా సమితి ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. ఐక్యతతో అభివృద్ధికి కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఐక్యతతో జాతి అభివృద్ధికి చేయూత అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కుడ్మెత భీంరావు, మెస్రం గుణవంత్‌రావు, సిడాం వామన్‌రావు, మీన, గౌరవ్, మడావి లక్ష్మణ్, కొడప భీంరావు, కోవ శ్రీరామ్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి ప్రమోద్‌రెడ్డి

తలమడుగు: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి ప్రమోద్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో డీలర్ల సమావేశం నిర్వహించారు. త్వరలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుందని రైతు సోదరులు దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసేందుకు వస్తారన్నారు. వారికి నాణ్యమైన విత్తనాలు అందించాలని సూచించారు. అదేవిధంగా విత్తనాలు ఎరువులు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా బిల్లులు అందిచాలన్నారు. పంట పొలాల్లో గంజాయి సాగు చేస్తే సంబంధిత రైతుకు ప్రభుత్వ పథకాలు వర్తించవన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాధిక, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, వ్యవసాయాధికారులు రమేష్, డీలర్లు పాల్గొన్నారు.

విత్తనాలు కొనుగోలు చేస్తే రశీదు ఇవ్వాలి

తాంసి: విత్తనాలు కొనుగోలు చేస్తే తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి రవీందర్ విత్తన డీలర్లకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో విత్తనాల డీలర్లకు టాస్క్‌ఫోర్స్ టీంతో కలిసి సమావేశం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ విత్తన దుకాణాల ఎదుట స్టాక్ బోర్డ్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ లక్ష్మి, ఎస్సై దివ్య భారతి, డీటీ జాదవ్ గణేశ్, డీలర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



పరామర్శిస్తున్న విశారదన్ మహరాజ్

బోథ్: సొనాల మండలంలోని సూర్యగనర్ గ్రామానికి చెందిన కుందూరు రాకేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, సాకెర గ్రామానికి చెందిన కుందూరు రాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ బాధిత కుటుంబాలను శుక్రవారం పరామర్శించారు. కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు అన్నెల లక్ష్మణ్, వెంకటేశ్, శేఖర్, గణేష్, అశోక్, నరేశ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం పరిశీలన



పరిశీలిస్తున్న ఎంఈ పేరి రాజు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని ఎంప్లాయీస్ కాలనీలో డ్రయినేజీపై అక్రమంగా చేపడుతున్న నిర్మాణాన్ని శుక్రవారం మున్సిపల్ ఇంజనీర్ పేరి రాజు పరిశీలించారు. ఓ ప్రైవేట్ లేఅవుట్‌దారు బల్దియా అనుమతి లేకుండా నిర్మాణాన్ని చేపడుతున్నారని కాలనీవాసులు చేసిన ఫిర్యాదు మేరకు ఆయన సందర్శించారు. సదరు వ్యక్తి అందుబాటులో లేకపోవడంతో తక్షణమే పనులు నిలిపివేయాలని కార్మికులను ఆదేశించారు. ఆయన వెంట డీఈ కార్తీక్, కాలనీవాసులు ఉన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న రితేష్‌రాథోడ్

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాంబ్లే బాలాజీ ఇటీవల అనారోగ్యం బారిన పడి చికిత్స పొందడంతో బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ శుక్రవారం ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు కేంద్రే బాలాజీ, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు రాథోడ్ రాధిక, రాథోడ్ భీంరావ్ ఉన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి



పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో పాల్గొన్న అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని ఎంఈవో కంటె నర్సయ్య అన్నారు. మండలంలోని యాపల్‌గూడ ప్రాథమిక, హైస్కూల్‌లో కొనసాగుతున్న ఆర్టిఫిషల్ ఇంటలిజన్స్ (కృత్రిమ మేధా) క్యాంప్, హైస్కూల్‌లో కొనసాగుతున్న ఇండోర్ గేమ్స్ శిబిరాలను శుక్రవారం పరిశీలించారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు ఆయా పాఠశాలలో కొనసాగుతున్న శిబిరాలను సందర్శించడం జరిగిందన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రతి శుక్రవారం టీచర్స్, పేరెంట్స్‌తో సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు సుజాత్ ఖాన్, నారాయణ, ఉదయశ్రీ, శ్రీకాంత్ గౌడ్, ఎస్ఎంసీ చైర్మన్ ఆకాష్, ప్రధానోపాధ్యాయుడు తూరాటి గంగన్న, పేరెంట్స్, తదితరులు పాల్గొన్నారు.

‘పాకిస్తాన్, బంగ్లాదేశ్ పౌరులను తరలించాలి’



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

తలమడుగు: పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల పౌరులను వెంటనే పంపించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ పహల్గాం దాడి వెనక పాకిస్తాన్ హస్తం ఉందని, దీనికి మన ఆదిలాబాద్ జిల్లాలో నివసిస్తున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్ పౌరులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, నక్క ధనుంజయ్, ముత్యాల దేవన్న, దాతజీ కిరణ్, అడెపు శ్రీనివాస్, గోడం భుజంగ్ రావ్, నైతం పాయల్, మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



ఇంద్రవెల్లి: మండలంలోని వడగామ్ గ్రామ పరిధిలో మెస్రం గోపు, మెస్రం మధుకర్ అనే రైతుల వ్యవసాయ భూములకు త్రీపేజ్ విద్యుత్ సరఫరాకు స్తంభాలు గాలివానతో నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నెలకొరిగిన విద్యుత్ స్తంభాలను బాగు చేసి విద్యుత్ సరఫరా చేయాలని విన్నవించినా.. అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ అర్బన్ మండలంలోని ఖానాపూర్ సబ్‌స్టేషన్ మరమ్మతులు చేపడుతున్నందన శనివారం ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని అశోక్ రోడ్, ఖానాపూర్, సోనార్ గల్లి, బొక్కలగూడ, కొలిపురా, మసూద్ చౌక్, దంగర్ గల్లీ, శాంతినగర్ ఏరియాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాంసి: భీంపూర్ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ తిరుపతి రెడ్డి తెలిపారు. నిపాని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

బోథ్: బోథ్, పాచ్పెర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ శ్రావణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మర్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎస్సై ప్రవీణ్ కుమార్

బోథ్: మద్యం సేవించి వాహనాలను నడపవద్దని బోథ్ ఎస్సై ఎల్. ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుచులాపూర్ శివారులోని వేంకటేశ్వర ఆలయం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాల పత్రాలను పరిశీలించారు. పలువురు వాహనదారులకు జరిమానా విధించారు.

స్క్రాప్ దుకాణంలో..

బోథ్ మండల కేంద్రంలోని పలు స్క్రాప్ దుకాణాల్లో కొంతమంది బైక్‌లను విక్రయించినట్లు తెలుసుకున్న బోథ్ పోలీసులు శుక్రవారం బైక్ వివరాలపై ఆరా తీశారు. వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ బైక్‌లను ఎవరూ విక్రయించారో తెలుసుకున్నారు. గత కొంత కాలంగా పలు ప్రాంతాల్లో బైక్ దొంగతనాలు జరుగుతుండటం, తక్కువ ధరకు స్క్రాప్ దుకాణాల్లో విక్రయించడం జరుగుతుండటంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



ఎస్సై రాధికను సన్మానిస్తున్న నాయకులు

తలమడుగు: శాంతిభద్రత పరిరక్షణకు సహకరించాలని ఎస్సై రాధిక అన్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు తుడుందెబ్బ నాయకులు ఎస్సైని కలిసి సన్మానించారు. శాంతిభద్రతల బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఆదివాసీ గ్రామాల్లో గంజాయిని సాగు చేయవద్దన్నారు. కార్యక్రమంలో పోచన్న, జ్ఞానేశ్వర్, భుజంగరావు, సహకార సంఘం సీఈవో మోతి శ్రీనివాస్, మాచర్ల రాజు, స్వామి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.